

టిటిడి చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిటిడి చైర్మన్ బి.ఆర్.నాయుడుని మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తిరుమలలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టిటిడి చైర్మన్‌గా సరైన వ్యక్తిని సిఎం చంద్రబాబు నాయుడు నియమించారని అన్నారు. బి.ఆర్. నాయుడు ఆధ్వర్యంలో తిరుమల దేవస్థానం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట టిడిపినాయకులు షంషీర్, పెంచుపాడు స్వామి, రాటకొండ మధుబాబు, పూల మురళి ఉన్నారు.



బిఆర్ నాయుడితో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజుపై బదిలీ వేటు

- వైసిపి నేత రవీంద్రారెడ్డి పరార్ ఘటనలో చర్యలు
- చిన్నచౌక్ సిఐ సస్పెన్షన్
- ఘటనపై సిఎం చంద్రబాబు, డిజిపి సీరియస్
- కడపలో డిఐజి కోయ ప్రవీణ్ మకాం
- అన్నమయ్య జిల్లా ఎస్‌పికి అదనపు బాధ్యతలు అప్పగింత



మాజీ సిఎం జగన్‌తో రవీంద్రారెడ్డి (ఫైల్ ఫోటో)



ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది. వైసిపి సోషియల్ మీడియా కార్యకర్త వర్రా రవీంద్రారెడ్డిపై చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. వివరాలలోకి వెళితే...మంగళవారం రాత్రి పులివెందుల పోలీసులు సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టారనే ఫిర్యాదులపై నిందితుడిని అదుపులోకి తీసుకుని కడపకు తరలించి, తెల్లవారుజామున 41(ఎ) నోటీసులిచ్చి వదిలేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. కొన్నేళ్ల కిందటి నుంచి పలు సందర్భాల్లో సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, హోంమంత్రి అనిత, విద్యా శాఖ మంత్రి లోకేష్, వైఎస్.విజయమ్మ, వైఎస్.సునీత, తదితర ప్రముఖులపై అనుచిత పోస్టులు పెట్టారనే ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే రవీంద్రారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని నోటీసులిచ్చి విడుదల చేశారు. ఆరు రోజుల నుంచి అనుచిత పోస్టులు వెల్లువెత్తాయనే ఆరోపణలతో తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకుని కడపకు తరలించారు. కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి అనుయాయుడైన పాపులు కదిలించినట్లు సమాచారం. చిన్నచౌక్ పోలీసులు 41(ఎ) నోటీసులు ఇచ్చి బుధవారం తెల్లవారుజామున పంపించారు. అప్పటికే అన్నమయ్య జిల్లా రాజంపేట పోలీసులు మరొక కేసు కింద అరెస్టు చేయడానికి వచ్చినప్పటికీ గుట్టుచప్పుడు గాకుండా విడుదల చేయడం ఏమిటనే అంశం చర్చనీయాంశంగా మారింది. నిందితునిపై కడప, రాజంపేట, ప్రొద్దుటూరు, హైదరాబాద్, మంగళగిరి, తదితర ప్రాంతాల్లో సుమారు 30కిపైగా కేసులు ఉన్నప్పటికీ 41(ఎ) నోటీసులిచ్చి విడుదల చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. వర్రా రవీంద్రారెడ్డి కోసం కడప జిల్లా పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వేములలో వర్రా రవీందర్‌రెడ్డి స్నేహితుడు మహేశ్వరరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. బుధవారం ఉదయమే కర్నూలు రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ కడపలో మకాంవేసి ఎస్‌పి హర్షవర్ధన్‌రాజుతో రవీందర్‌రెడ్డి అరెస్ట్, విడుదల, పరారీ తదితర అంశాలపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి కనుసైగల్లో పోలీసులు నడుస్తున్న నేపథ్యం చర్చకు వచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి చంద్రబాబు పోలీసుల పనితీరుపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. వర్రా రవీంద్రారెడ్డి వ్యవహారంపై సీరియస్ అయిన ప్రభుత్వం కడప ఎస్పీ హర్షవర్ధన్‌రాజును బదిలీ చేయడంతోపాటు చిన్నచౌక్ సిఐ తేజోమూర్తిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజును హెడ్క్వార్టర్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. కడప జిల్లా ఎస్‌పిగా అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడుకు అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు
- డిఆర్‌ఒ మధుసూదన్‌కు వినతి పత్రం సమర్పణ

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలల అవుతున్నా విద్యారంగ సమస్యలు ఎక్కడికక్కడా కూరుకు పోయ యాన్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో విద్యా వసతి దీవెన బకాయిలు రూ.3480 కోట్లు చెల్లించకపోవడంతో విద్యార్థులు సక్రమంగా విద్యను అభ్యసించక ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలో ఫీజులు ఒత్తిడి భరించలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. జిల్లాలోని రాజంపేట, మదనపల్లి, రాయచోటి ప్రాంతాల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, ఐటిఐ డిగ్రీ కోర్సులు చదువుతున్న విద్యార్థులు ఫీజులు కట్టలేక పోతున్నారని అన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 19 మండలాలు కరువు మండలాలకు ప్రకటించినప్పటికీ ఆ మండలాల్లో ఉపాధి లేక వలస వెళ్లి తల్లి తండ్రులు విద్యార్థులను చదివించు కుంటున్నారని తెలిపారు. ఫీజులు వేధింపులు భరించలేక అనేకమంది విద్యార్థులు మధ్యలో చదువులు మానేసి ఉపాధికి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఫీజు బకాయిల చెల్లించి విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ ఎస్‌ఎంఎస్ హాస్టల్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని గత తొమ్మిది నెలల నుంచి మెస్ చార్జీలు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురువుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదని, అనేక హాస్టల్స్ సొంత భవనాలు లేక అరకొర సౌకర్యాలతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారని మండిపడ్డారు. కనీసం తాగడానికి మంచినీరు లేక బయట కొనుక్కొనే పరిస్థితి ఏర్పడిందని, సాంఘిక సంక్షేమశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి హాస్టల్ సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.340 కోట్లు విద్యాదీవెన, వసతిదివన బకాయిలను విడుదల చేయాలని అన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ విధానాన్ని రద్దు చేసి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. సంక్షేమ హాస్టల్స్‌కి సొంత భవనాలు కేటాయించి కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ.3వేలు పెంచాలన్నారు. అన్నమయ్య జిల్లాలో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబర్ 72 రద్దుచేసి పీజీ చదివే విద్యార్థులందరికీ ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తింపచేయాలని తెలిపారు. తల్లికి వందనం పూర్తి ఫీజు రీఎంబర్స్‌మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మద్దతు తెలిపారు. అనంతరం డిఆర్‌ఒకు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, రాయచోటి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురునాథ్, పవన్, సతీష్, మదనపల్లి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు జయ బాబు, సన్నీ, రాంబాబు, భాను ప్రకాష్, నందకిషోర్, గణేష్, పవన్ తేజ్, గోవర్ధన్ విద్యార్థులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

'ఫ్రీహోల్డ్ భూముల అర్జీలపై దృష్టి సారించాలి'



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-పెనగలూరు

ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ ప్రక్రియకు సంబంధించి గ్రామ సభల నిర్వహణ ద్వారా వచ్చిన వివిధ రకాల అర్జీలపై దృష్టి సారించి వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ చామకూరు శ్రీధర్ అధిరులను ఆదేశించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయాన్ని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భండి కలెక్టర్ ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ, ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, విఆర్‌ఒలు, పంచాయతీ సెక్రటరీలు, గ్రామ సర్వేయర్లు, తదితరులతో పిజిఆర్‌ఎస్ ద్వారా వచ్చే అర్జీలు, గ్రామసభల నిర్వహణ, ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్, ఉచిత ఇసుక పాలసీ, ఎన్టీఆర్ హౌసింగ్ పథకం, తదితర అంశాలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్ ద్వారా వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీదారుడు దగ్గరికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే అర్జీని పూర్తిగా పరిష్కరించినట్లు అవుతుందని తెలిపారు. మండలంలో ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు అవ్వాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్టీఆర్ హౌసింగ్ పథకంలో పురోగతి పెంచాలని, మౌలిక సదుపాయాలు అందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. సమావేశంలో రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ లీలారాణి, ఎంపిడిఒ హరి, డిప్యూటీ తహశీల్దార్ జ్యోతి పాల్గొన్నారు.

కోమంతరాజుపురం ఇసుక రీచ్ తనిఖీ: మండలం కోమంతరాజుపురం సాండ్ రీచ్‌ను కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, సాండ్ రీచ్ నుంచి ఎన్ని టన్నుల ఇసుకను తరలిస్తున్నారు, ఏ విధంగా తరలిస్తున్నారు, తదితర ప్రశ్నలను ఆర్డిఓను, డిప్యూటీ తాసిల్దార్ ను, వీఆర్వోను అడిగి తెలుసుకున్నారు. మండలానికి తగినంత ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు అవ్వాలని, ప్రజలందరికీ ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని, ప్రజలకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

రాబోయే మూడు రోజుల్లో జిల్లాలోని 5.48 లక్షల గృహాలను సచివాలయ సిబ్బందితో యుద్ధ ప్రాతిపదికన జియో ట్యాగ్ పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఎంపిడిఒలను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ నుండి ఎంపిడిఒలు, డ్వామా ఎపిడిలు, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మూడు రోజుల్లోపు మంజూరైన ప్రతి గృహంతో పాటు వాటి ఇంటి నెంబర్లు జియో టాగింగ్ పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు పాటించాల్సిన విధానాలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. ఎంపిడిఒలు అందరూ సచివాలయ సిబ్బందితో వెంటనే సమావేశం ఏర్పాటు చేసి జియో టాగింగ్ పని పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. నవశకం పథకానికి సంబంధించి ఎన్‌పిసిఎల్ ఇన్ ఆక్టివ్ ఉన్న లబ్ధిదారులందరి బ్యాంక్ అకౌంట్లను తప్పనిసరిగా ఆధార్ సీడింగ్ చేయించాలని సూచించారు. ఇందుకు సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. పల్లె పండుగలో చేపట్టిన పనులు వందశాతం గ్రౌండ్ పూర్తి కావాలిన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న కారణాలతో ఇంకా గ్రౌండ్ కాకపోతే వెంటనే పని ప్రారంభించాలన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ నిర్లక్ష్యం వహిస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేపట్టిన ప్రతి పనిని నాణ్యతగా డిసెంబర్ మాసంతంలోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.విద్యార్థులకు అపార్ ఐడి త్వరితగతిన జనరేట్ చేసి పంచాయితీ సెక్రటరీలు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రతి స్కూల్ సందర్శించి ఎంతమందికి అపార్ ఐడి ఉంది ఎంతమందికి లేదని పరిశీలించి, ఐడి లేని వారందరికీ అపార్ ఐడి క్రియేట్ చేయడానికి కృషి చేయాలని చెప్పారు. గ్రామాలలో ఉపాధి హామీ పనులను విరివిగా కల్పించాలన్నారు. ఉపాధికి సంబంధించి పని విలువ రోజులు పెరగాలని, లేబర్ బడ్జెట్ను పెంచాలని సూచించారు. కొన్ని మండలాలు గ్రామాలలో కూలీల నమోదు శాతం చాలా తక్కువగా ఉందని ఎన్రోల్మెంట్ తప్పనిసరిగా పెంచాలన్నారు. లక్ష్యం మేర ప్రతి కుటుంబానికి వందరోజుల పని కల్పించాలని చెప్పారు. ఎస్సీ ఎస్టీలకు ఉపాధి కల్పన, వ్యక్తిగత కమ్యూనిటీ సోక్ పిట్స్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్, మినీ అమృత్ సరోవర్లు, ఫాం పాండ్లు, ఫాడర్, 90 మాన్డేస్, అవెన్యూ ప్లాంటేషన్, పల్లెవనాలు తదితర అంశాలలో ప్రగతిలో వెనుకబడిన వారితో మండలాల వారీగా సమీక్షించి, ప్రగతి సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పేద రైతులకు విరివిగా గోకులాలను మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటరత్నం, పిఆర్ ఎస్ఇ దయాకర్‌రెడ్డి, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ఎంపిడిఒలులు, ఎపిడిలు, పంచాయతీ కార్యదర్శులు, మండల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అహమ్మద్ బాషా

నెట్, సెట్ పోటీ పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంసిఎ విభాగం విద్యార్థులకు నెట్ ,సెట్ పరీక్షలపై అవగాహన సదస్సు ను ఏర్పాటుచేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా కడపకు చెందిన ఎయిమ్ అకాడమి లెర్నింగ్ సిఇఒ డాక్టర్ ఎస్. అహమ్మెద్ బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్) , స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) పరీక్షల ప్రాముఖ్యతని విద్యార్థులకు వివరించారు. ఈ పరీక్షలు విద్యార్థులకు వారి విద్యా, వృత్తిపరమైన కెరీర్‌లను గణనీయంగా మెరుగుపరుస్తాయని అన్నారు. నెట్, సెట్ పరీక్షలు పరిశోధన, అకాడెమియాలో వృత్తిని కొనసాగించడానికి ఆసక్తి ఉన్నవారికి అవసరమైన అర్హత మైలురాళ్ళుగా ఉపయోగపడతాయని అన్నారు. నెట్, సెట్ సర్టిఫికేషన్‌లు విద్యార్థుల ప్రొఫైల్‌లను పెంచుతాయని, ఉద్యోగ విపణిలో వారిని మరింత పోటీతత్వంగా మార్చగలవని అన్నారు. ఈ పరీక్షలలో రాణించడానికి అవసరమైన సిలబస్, అర్హత ప్రమాణాలు, పరీక్షల సరళి, ప్రిపరేషన్ మెళుకువలపై విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. నిర్మాణాత్మక అధ్యయన విధానాన్ని అవలంబించాలని, రిఫరెన్స్ పుస్తకాలు, ఆన్‌లైన్ స్టడీ మెటీరియల్స్, మాక్ టెస్ట్‌లతో సహా అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకోవాలని వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రామనాథన్, ఎంసిఎ విభాగాధిపతి డాక్టర్ నవీన్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల జీవితాలకు అద్దంపట్టే లఘుచిత్రం 'కనువిప్పు'

పజాశక్తి-మదనపల్లె అర్బన్ : వయో వృద్ధుల జీవితాలకు అద్దం పట్టే లఘు చిత్రం 'కనువిప్పు' అని చిత్ర నిర్మాత, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిగోపాల్ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు, వయోవృద్ధులకు సమస్య కాకుండా లఘుచిత్రం ద్వారా రివర్స్ మార్ట్ గేజ్ స్కీం గురించి సరికొత్త సందేశం ఇచ్చిన కనువిప్పు చిత్ర విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. లఘు చిత్రం కథానాయకుడు డాక్టర్ గొల్లపూడి తిరుపతిరావు, చిత్రం కథానాయకురాలు రిటైర్డ్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ధనలక్ష్మి, దర్శకులు రాజా అశ్వర్థ, కథా రచయిత టిఎస్‌ఎ. కృష్ణమూర్తి, రాజ గోపాల్ చిత్రం నటీనటులు, సాంకేతిక సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ చిత్రం విడుదల చేసిన 12 రోజుల్లోపే 15 దేశాల్లోనూ, ఆల్ ఇండియా, తెలుగు రాష్ట్రాల్లో 14 వేల మందికిపైగా వీక్షించడం హర్షణీయమని అన్నారు. ఈనెల 10వ తేదిన స్థానిక జిఆర్‌టి హైస్కూల్‌లో విజయోత్సవ వేడుకలు నిర్వహించి కనువిప్పు లఘుచిత్రంలో భాగస్వాములైన నటీనటులను, సాంకేతిక సిబ్బందిని సన్మానిస్తున్నామని చెప్పారు. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పారు. గొల్లపూడి తిరుపతిరావు మాట్లాడుతూ వయోవృద్ధులు వయోభారంతో ఉన్న సమయంలో ఆర్థిక ఇబ్బందులతో జీవన ప్రయాణం సాగిస్తుంటారని అన్నారు. ఈ చిత్రం వయోవృద్ధుల జీవితాలకు కనువిప్పు కలిగిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా శ్రీనివాసులు

ప్రజాశక్తి-పీలేరు



అన్నమయ్య జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలో పీలేరుకు చెందిన దళితనేత పాలకుంట శ్రీనివాసులుకు చోటు దక్కింది. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉత్తర్వులు జారీ చేశారు. గత పదిహేను ఏళ్లుగా పాలకుంట శ్రీనివాసులు దళిత ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం భారతీయ అంబేద్కర్ సేన (బాస్) సంస్థలో జిల్లా కో-కన్వీనర్ గా పనిచేస్తున్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేసి, అనేక సమస్యలు పరిష్కారం చేశారని చెప్పారు. మండల స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా, పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల్లో ఆయన అందించిన ఉత్తమ సేవలను గుర్తించి, ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా పాలకుంట శ్రీనివాసులు మాట్లాడుతూ బాస్ సంస్థలో తనకు సముచిత స్థానం కల్పించి తద్వారా జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక కావడానికి కృషిచేసిన భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్, తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి, డివియంసిలో తనకు చోటు కల్పించిన కలెక్టర్ శ్రీధర్ చామకూరికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు లభించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఎస్‌సి,ఎస్‌టి సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా పని చేస్తానని చెప్పారు. **హర్షం తెలిపిన దళిత నాయకులు :** డివిఎంసి సభ్యుడిగా పాలకుంట శ్రీనివాసులు నియామకంపై పలువురు దళిత నేతలు హర్షం ప్రకటించి, శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, బాస్ రాష్ట్ర కన్వీనర్ ఉలగనాథన్ గణపతి, రాష్ట్ర కార్యదర్శులు కె.వి.రమణ, పల్లం తాతయ్య, జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, జిల్లా నాయకులు ముల్లంగి కృష్ణయ్య, ఆరుమడకల నాగరాజ, సచిన్, సింగన్న, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ప్రభు, బుద్ధ అంబేద్కర్ సమాజ్ ప్రతినిధులు డాక్టర్ సి.చంద్రయ్య, బురుజు లక్ష్మీనారాయణ, డాక్టర్ గంగాద్రి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- ఆర్‌డికి ఎపిఎన్‌జిఒ నాయకులు విజ్ఞప్తి

ప్రజాశక్తి-కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, కర్నూలు జిల్లా అధ్యక్షులు సిహెచ్.వెంగల్‌రెడ్డి రాష్ట్ర సహాధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి కోరారు. బుధవారం ఆర్‌డి కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డిశ డాక్టర్ బి.రామ గిడ్డయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ సమస్యలు, నర్సింగ్ సూపరింటెండెంట్, ఫార్మసిస్ట్, అన్ని పదహొన్నతలు త్వరగా ఇవ్వాలని నాయకులు కోరారు. ఆర్‌డి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, బాల పుల్లయ్య, నిత్య పూజయ్య, సిటీ అధ్యక్షులు చిన్నయ్య, పద్మనాభం, రామ సుబ్బారెడ్డి, ఖాసన్న, జిల్లా మహిళా నాయకులు గౌరీ, జ్యోతి, పద్మజీ, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

10న ఉచిత డిఎస్‌సి శిక్షణ అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్ట్

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వము సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా నిరుపేద ఎస్‌సి, ఎస్‌టి అర్హులైన అభ్యర్థులు ఇది వరకే ఉచిత డిఎస్‌సి శిక్షణ కొరకు నమోదు చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.జయప్రకాష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 10న ఉదయం 10.30 నిమిషముల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు స్క్రీనింగ్ టెస్టు జరుగుతుందని తెలిపారు. పరీక్షకు గంటకు ముందే హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొనుటకు https://jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు హెల్ప్ డెస్క్ నెంబర్లు రాయచోటి 9440256697, మదనపల్లి 9440256697ను సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు కడపకు శాప్ చైర్మన్ రాక

ప్రజాశక్తి-కడప

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (శాప్) చైర్మన్ అనిమిని రవి నాయుడు ఈ నెల 7వ తేదీన కడపకు రానున్నారు. ఏడవ తేదీన ఉదయం 8 గంటలకు తిరుపతి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 11 గంటలకు కడప జిల్లా స్పోర్ట్స్ అథారిటీ స్టేడియానికి చేరుకుంటారు. అనంతరం 11.30 గంటల నుండి అన్ని క్రీడా సంఘాలతోను, పిఇటిలతోనూ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్థానిక రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్పోర్ట్స్ స్కూల్‌ను సందర్శించి అక్కడ మైదానాలను, స్పోర్ట్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్పోర్ట్స్ స్కూల్లో విలేకరుల సమావేశం నిర్వహిస్తారు. అనంతరం స్పోర్ట్స్ స్కూల్ సిబ్బందితోనూ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సిబ్బందితో సమావేశం నిర్వహిస్తారు.

ఎపిఎస్‌ఆర్‌టిసి ఈడిగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-కడప అర్బన్



ఎపిఎస్‌ఆర్‌టిసి కడప జోన్ ఈడిగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి ఈడిగా ఉన్న చెంగల్‌రెడ్డిని విజయవాడకు బదిలీ అయ్యారు. అక్కడ ఈడిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ కడపకు బదిలీపై వచ్చారు. డిపో మేనేజర్‌గా 10 సంవత్సరాల పాటు వివిధ ప్రాంతాలలో పనిచేశారు. 2017లో ఆర్వంగా కర్నూల్‌లో పనిచేశారు. 2020లో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. హెడ్ ఆఫీస్‌లో చీఫ్ కమర్షియల్ మేనేజర్‌గా పని చేశారు. 2024లో ఎపిఎస్‌ఆర్‌టిసి ఈడిగా పదోన్నతి పొంది ప్రధాన కార్యాలయంలో పనిచేస్తూ కడపకు బదిలీపై వచ్చారు. అధికారుల సహకారంతో ముందుకు వెళతానని మీడియాకు తెలిపారు. రాష్ట్రంలోనే అతిపెద్ద జోన్ కడప అని, ఈ జోన్ పరిధిలో ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి ఉన్నారని చెప్పారు. ఎక్కువగా అంతర్రాష్ట్ర సర్వీసులు చెన్నై బెంగళూరు హైదరాబాద్ ఉన్నాయని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న బాధితులు

తల్లీబిడ్డల ఆత్మహత్య కేసును నీరుగారుస్తున్న పోలీసులు

- న్యాయం జరగలేదంటూ బంధువుల ఆవేదన

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణం కొత్తపేటలో ఆగస్టు 17వ తేదీన తన ఇద్దరు పిల్లలతో కలిసి గ్యాస్ లీక్ చేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎర్రగుడి రమాదేవి(34) కేసును రాయచోటి పోలీసులు నీరుగార్చడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆమె సోదరుడు గాలివీటి నారాయణ, గాలివీటి వెన్నెల బంధువులు శాంతమ్మ, సరోజమ్మ, లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిన కేసు విషయంలో మూడోసారి అన్నమయ్య జిల్లా ఎస్పీని కలిసిన అనంతరం బుధవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన భర్తతో మృతురాలు రమాదేవికి వివాహేతర సంబంధం ఉందని మనసులో పెట్టుకున్న సచివాలయ ఉద్యోగి జ్యోతి ప్రతినిత్యము మృతురాలిపై ఏదో ఒక రూపంలో వేధిస్తూనే ఉందని తెలిపారు. మృతురాలు రమాదేవి భర్త ఎర్రదొడ్డి రాజా జ్యోతితో సన్నిహితంగా ఉంటారని వాళ్ళిద్దరూ కూడా నిత్యము ఫోన్లలో మాట్లాడుకుంటూ మృతురాలని నరకం చూపించే వారిని ఆరోపించారు. ఈ పరిస్థితులలో ఆగస్టు 17వ తేదీన రాత్రి పదిన్నర గంటలకు సచివాలయ ఉద్యోగి జ్యోతి మృతురాలు ఇంటి వద్దకు వెళ్లి ఇంటి బయటకు వచ్చి నా చేతిలో చస్తావా ఇంట్లోనే చస్తావా అంటూ బజారులో జ్యోతి కేకలు వేయడం వలన బూతులు తిట్టడం వలన అవమానానికి గురైన మృతురాలు రమాదేవి పిల్లలతో సహా ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. ప్రతి చిన్న కేసులో కూడా పోలీసులు హడావిడి చేస్తుంటారని ఇంత పెద్ద కేసులో ఇప్పటివరకు విచారణ ముందుకు సాగకుండా ఉన్నదని ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతురాలు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవడానికి ప్రధాన కారణమైన సచివాలయ ఉద్యోగి జ్యోతినిపై కేసు పెట్టి అరెస్టు చేయడంతో పాటు కువైట్‌లో ఉన్న రమాదేవి భర్తను తక్షణ రప్పించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కింది స్థాయి పోలీసుల వద్ద న్యాయం జరగలేదంటూ జిల్లా నలుమూలల నుండి ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేస్తున్న బాధితుల పట్ల అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర సహాయ కార్యదర్శి న్యాయవాది ఈశ్వర్ ఆరోపించారు. బాధితుల న్యాయం చేయాలని కోరారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకొని విద్యా వ్యవస్థలో ప్రభుత్వ నిబంధనల మేర వ్యవహరించేలా చర్యలు చేపట్టాలని డిఇఒనును టిఎన్‌ఎస్‌ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్ కోరారు. బుధవారం డిఇఒను మర్యాదపూర్వకంగా కలిసి విద్యార్థుల సమస్యలపై , కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్న తీరుపై పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం డిఇఒ ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

-జిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు



పంటల బీమా గురించి రైతులకు వివరిస్తున్న ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు

ప్రజాశక్తి-కలికిరి

రబి పంట వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలనిజిల్లా ఉద్యాన అధికారి పి.రవిచంద్రబాబు తెలిపారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో వాయ ల్పాడు, కలికిరి, కలకడ, యిబటతీపల్లి, గుర్రంకొండ, పీలేరు మండల ఉద్యాన, వ్యవసాయ సహాయకులకు కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో రబీ సీజన్ 2024-25 టమోటా పంట బీమాపై అవగాహన, శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన అధికారి పి . రవిచంద్రబాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలలో టమోటా జిల్లాలో రెండవ ప్రధానమైన పంట అని, రబీ సీజన్‌లో టమోటా సాధారణ విస్తీర్ణం 4వేల ఎకరాల్లో సాగవుతుందని అన్నారు. అక్టోబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు నాటే టమోటా పంటలకు వాతావరణ పరిస్థితులలో మార్పులు వల్ల పంట నష్టం జరిగితే రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రబీ సీజన్‌లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. రైతులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జిల్లాకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీని ఎంపిక చేశారన్నారు. రబీ సీన్‌లో సాగు చేసిన రైతులు ఎకరానికి 1600 చొప్పున ప్రీమియం చెల్లిస్తే రూ.32వేలు పంట నష్టపరిహార బీమాను పొందవచ్చని తెలిపారు. టమోటా పంటపై బ్యాంకులో పంట రుణం తీసుకున్న రైతులు బ్యాంకులో అంగీకార పత్రాన్ని ఇచ్చినట్లయితే పంట రుణం నుండి బ్యాంకు నేరుగా బీమా ప్రీమియంను చెల్లించుకుంటుందని అన్నారు. పంట రుణం తీసుకొని రైతులు నేరుగా స్వచ్ఛందంగా కానీ లేదా కామన్ సర్వీస్ సెంటర్‌లో కానీ, గ్రామ సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో భూమి 1బి, ఆధార్, బ్యాంక్ అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రం సమర్పించి నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. మరిన్నీ వివరాలకు ఇఫ్కో టోక్యో జిల్లా కో-ఆర్డినేటర్, గ్రామ సచివాలయ రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. కెవికె పొగ్రామ్ కో-ఆర్డినేటర్ మంజులా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్తుతుల్లో ఖర్చు తగ్గించి అధిక ఆదాయాన్ని పెంచేందుకు చేపట్టవలసిన పద్ధతులైన పచ్చిరొట్ట, ఎరువుల వాడకం, పసుపు, బులుగు రంగు జిగురు అట్టలు అమర్చడం, పరిస్తుతులకి అనుకూలంగా అవసరమైన పురుగు, తెగుళ్ల యాజమాన్యం పాటించి విదంగా రైతులకు తెలపాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుతం మామిడి, టమోటా పంటలలో చేపట్టవలసిన కార్యక్రమాలపై రైతు సేవా కేంద్రం సిబందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీలేరు ఉద్యాన అధికారి టి.సుకు మార్‌రెడ్డి, వాయల్పాడు ఇన్‌ఛార్జి ఉద్యాన అధికారి ఇ.ఈశ్వరప్రసాద్ రెడ్డి, రైతు సేవా కేంద్రం సిబంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్ష


మాట్లాడుతున్న తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌రావు, సిపిఒ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగంపేట గ్రామ సమస్యలపై గ్రామస్తులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, మాజీ డిపిఆర్‌సి బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంగంపేట గ్రామాల్లోని కాపుపల్లి, హరిజనవాడ, అరుంధతి వాడ గ్రామాల ప్రజలకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని అన్నారు. మృతి చెందిన వారి నష్టపరిహారం అర్హులైన వారి కుటుంబ సభ్యులకి తక్షణమే అందించాలని కోరారు. పునరావాస గ్రామాల ప్రజలకు 2013 షెడ్యూల్ 3 ప్రకారం ఆర్గనైటెడ్ బిల్డింగ్స్ సచివాలయం, స్కూల్, హాస్పిటల్, కమ్యూనిటీ హాల్, హెల్త్ సెంటర్ ఫర్ షెల్టర్, పార్క్, షాపింగ్ మహల్ కాంప్లెక్స్, అండర్ డ్రెయినేజీ, పోస్ట్ ఆఫీస్, రేషన్ బిల్డింగ్ స్త్రీశక్తి భవనం, క్రీడామైదానం, జిఒ నెంబర్ 160 ప్రకారం పశువుల మేత బీడుభూమి తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు 227 మందికి ఎపిఎం డిసిసి ద్వారా వృద్ధులకు వితంతువులకు పింఛన్లు అందించే వారని అన్నారు. సిపిఒ సుదర్శన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత పెన్షన్ల తొలగించి 90 మందికి మాత్రమే అందించడం దురదృష్టకరమని అన్నారు. మంగంపేట పునరావాస పంచాయతీ గ్రామాలైన కాపుపల్లి, హరిజనవాడ అరుంధతివాడ గ్రామాలకు అన్యాయం జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకునేది లేదని గ్రామస్తులకు న్యాయం జరిగే విధంగా 16 రోజుల్లోపు చర్యలు చేపట్టుకుంటే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు.కార్యక్రమంలో కవులూరు రమణారెడ్డి, దేవా మంగంపేట గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


క్రీడా మైదానాన్ని తయారు చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-రామాపురం

విద్యార్థులలో దేశభక్తిని, సేవ భావాన్ని కలిగించడమే ఎన్ఎస్ఎస్ ముఖ్య లక్ష్యమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిన్న రెడ్డప్ప పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బుధవారం ఉపాధ్యాయురాలు అప్రోచ్ బేగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విద్యార్థులు పాఠశాల ఆట స్థలాన్ని శుభ్రపరిచి వారు ఆడే క్రీడలకు సంబంధించి కోర్టులు తయారు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. పాఠశాల ఆటస్థలం లాగే తమ సొంత గ్రామాలల, పరిసర పరిశుభ్రత చేపట్టాలని వాలంటరీ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. పాఠశాల, కళాశాలలోనూ ఎన్ఎస్ఎస్ స్కీంను ఏర్పాటు చేయడం విద్యా ర్థులలో తాము ఉన్న ప్రదేశం పట్ల దేశం పట్ల సేవా భావం కలుగుతుందని అన్నారు.



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి

సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

విద్యుత్‌శాఖలో పరిష్కారం కానీ సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేక విద్యుత్ అదాలతో నిర్వహిస్తున్నామని అధ్యక్షులు విశ్రాంత జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎడి కార్యాలయం వద్ద ఎపి దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక రాజంపేట వారి ఆధ్వర్యంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. దీర్ఘకాలికంగా విద్యుత్ శాఖలో పరిష్కారం కానీ సమస్యలను వ్రాతపూర్వకంగా అందించాలని వినియోగదారులను కోరారు. పలు సమస్యలపై వినియోగదారులు ఫిర్యాదులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు కె.రాజామోహన్‌రావు, సాంకేతిక సభ్యులు అంజనీ కుమార్, స్థానిక ఎడిఎం భాస్కరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.


టిడిపి సభ్యత్వ నమోదు చూపిస్తున్న భాను గోపాల్‌రాజు

టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్

టిడిపి సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని 35వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి కురుముట్ల నాగరాజు స్పష్టం చేశారు. బుధవారం కాట్లటపల్లి రోడ్డు, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి సీనియర్ నాయకులు రామిశెట్టి నీలకంఠ, మోడెం సిద్దప్ప, రామిశెట్టి కృష్ణ, ఉప్పు రామచంద్రలు హాజరయ్యారు.ఈ సందర్భంగా కురుముట్ల నాగరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా ఆదేశాల మేరకు వార్డులో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. 2 వేల సభ్యత్వాలు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇప్పటికే 1500 సభ్యత్వాలు పూర్తిచేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేంద్ర, కె.దీపక్ కుమార్, తేజ, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, మారుతీ నగర్, రాజా నగర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **వీరబల్లి :** రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసి వీరబల్లి మండలంలోని అత్యధికంగా సభ్యత్వ నమోదు చేయాలని ప్రతి ఒక్కరిని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురేంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, గ్రామ కమిటీ భాస్కర్ రాజు,శివకుమార్ నాయుడు, రాజరాజు, మాజీ సర్పంచ్ మల్లికార్జున, సీతారామరాజు, సిద్ధిరాజు, రవిరాజు, లక్ష్మి రెడ్డి, రెడ్డయ్య రాజు, సాయిరాం రాజు, రమణ, వినయ్, శివ, రామకృష్ణంరాజు, నరసింహులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట ఓబులవారిపల్లి మండలం, మంగంపేట ఎపిఎండిసి సంస్థలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు ఎపిఎండిసి యాజమాన్యం చాలా కాలం నుంచి కాలయాపన చేస్తోందని, వారికిరావాల్సిన హక్కులను ఇవ్వాలని కోరుతూ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ హైదరాబాద్ వారికి పోరాట కమిటీ జెఎసి నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సెంట్రల్ హైదరాబాద్ వారు పోరాట కమిటీ జెఎసి నాయకులను ఏపీఎండిసి యాజమాన్యం వారిని బుధవారం చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చలలో పోరాట కమిటీ జెఎసి కన్వీనర్ ఆర్ వెంకటేష్, పోరాట కమిటీ జెఎసి నాయకులు, ఎపిఎండిసి యాజమాన్యం తరపున అడిషనల్ జనరల్ మేనేజర్ జోసెఫ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

అభివృద్ధి చూసే వైసిపి నుంచి వలసలు

ప్రజాశక్తి-వీరబల్లి

కూటమి ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి వైసిపి నుంచి నాయకులు టిడిపిలోకి చేరుతున్నారని మండల టిడిపి నాయకులు శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొందరు అవగాహన లేకుండా పదవులు కాపాడుకునేందుకే టిడిపిలోకి వస్తున్నారనే ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వారికి పదవులు కొత్త ఏమి కాదని, పేరు ప్రఖ్యాతలు ఉన్న నాయకులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి బాటలో నడిపించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆదరణ చూసి రాష్ట్రంలో వలసలు మొదలు అయ్యాయని అన్నారు. మండలంలోని వైసిపి నేతలు మరికొందరు టిడిపిలో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. మండలంలోని సీనియర్ నేతలు, కార్య కర్తలను కలుపుకొని వారి సూచనలతో మండలాన్ని పసుపుమయం చేస్తామని అన్నారు.

'మహిళా సాధికారత'పై వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి-కలకడ

మహిళా సాధికారత అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు వైస్ ప్రిన్సిపల్ పెద్దవీటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలో పాఠశాల విద్యార్థులకు మహిళా సాధికారత అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కలకడ ఆదర్శ పాఠశాలకు చెందిన మిన్హా మొదటి బహుమతి రూ.5వేలు, మోక్షశ్రీ ద్వితీయ బహుమతి రూ.3వేలు,దైవిక్ రెడ్డి తృతీయ బహుమతి రూ.2వేలు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో పురు షులకు ఏమాత్రం తీసిపోకుండా రాణిస్తున్నారని అన్నారు. నేటి విద్యార్థినిలు కష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలు సంపా దించి పాఠశాలకు సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తేవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ రమేష్‌నాయుడు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గాలివీడు

మండలంలోని పక్కాగృహాల లబ్ధిదారులచే డిసెంబర్ 31 లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ జవహర్ బాబు తెలిపారు. బుధవారం ఉపాధి కార్యాల యంలో ఇంజినీర్ అసిస్టె ంట్లుతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 622 గృహాలు ఇన్ ప్రోగ్రెస్‌లో ఉన్నాయని వాటిని త్వరగా పూర్తిచేయాలని పేర్కొన్నారు. మస్టర్, ఎంబుక్‌ని ఉపయోగించి పునాదికి 50 రోజులు పని దినాలు, గోడలకు 50 రోజులు పని దినాలు ఉపాధి పథకం కింద వారికి వర్తింపచేయాలని పేర్కొన్నారు. హౌసింగ్ బిల్లులు పెండింగ్ లేకుండా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రమేష్‌నాయక్, ఎపిఒలు రామచంద్రయ్య, హరిప్రసాద్, ఇసి బాలాజీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి గృహాన్ని సందర్శించాలి

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామంలోని ప్రతి గృహాన్ని సందర్శించాలని ఎంపిడిఒ సిఎ. జవహర్ బాబు పేర్కొన్నారు. బుధవారం ఎంపిడిఒ సభా భవనంలో నైపుణ్య గణన అభి వృద్ధిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు మీరు సచివాలయం నుంచే ప్రతి గృహాన్ని సందర్శించి ఇప్పుడు గణన అభివృద్ధి పైన పక్కాగా నిర్వహించాలని సూచించారు. సుకుమార్ కాలేబు ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్లుకు, సర్వేలకు ఎనర్జీ సిబ్బందికి, డిజిటల్ అసిస్టెంట్లు, విఆర్ఒ, ఎఎన్ఎంలకు శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిఒ హరిప్రసాద్, హౌసింగ్ ఎఇ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

అంగన్వాడీ కేంద్రాలను సమిష్టి కృషితో బలోపేతం చేద్దామని ఐసిడిఎస్ పీడీ రమాదేవి అన్నారు. బుధవారం ఐసి డిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ పిల్లల హాజరు శాతం పెంచడానికి తగిన చర్యలు తీసుకోవాలని పిల్లల పోషణ స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఎలాంటి లోపాలు లేకుండా కార్యకర్త, ఆయా సమిష్టి కృషితో ఆహారం అందించాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో రాయచోటి అదనపు సిడిపిఒ సుగుణ, అంగన్వాడీ సూపర్‌వైజర్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-పుల్లంపేట : మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి గ్రామంలో బుధవారం సర్పంచ్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కుమార్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలోని వీధుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు.పంచాయతీ మొత్తం బ్లీచింగ్, సున్నం చల్లడం జరిగిందని పేర్కొన్నారు. శీతాకాలం సమీపిస్తున్న వేళ పంచాయతీలో ప్రజలకు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా గ్రామంలో పారిశుధ్య పనులు మెరుగుపరచినట్లు తెలిపారు.. పంచాయతీ మోటార్ వద్ద ఉన్న పిచ్చి మొక్కలను కూడా తొలగించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

చెత్త దిబ్బలను తొలగింపజేస్తున్న కుమార్‌రెడ్డి

సైబర్ నేరాలపై అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై వెలుగు మహిళా సంఘ సభ్యులకు అవగాహన ముఖ్యమని ఆర్‌బిఐ కౌన్సిలర్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. గురువారం శ్రీ శక్తి భవన్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మహిళా సభ్యులు సెల్ ఫోన్లలో వచ్చే మెసేజ్‌లకు స్పందిం చకూడదని అన్నారు. వారు ఒటిపి బ్యాంకు వివరాలు, ఆధార్ కార్డు నెంబర్, రేషన్‌కార్డు అడిగినప్పుడు వారికి ఏమాత్రం తెలుపకూడదని అన్నారు. ఎక్కడ పడితే అక్కడ వేలు ముద్రలు వేయకూడదని సూచించారు. అలా వేలిముద్ర వేస్తే ఆ వ్యక్తి సంబంధిత వివరాలన్నీ వారు దొంగిలిస్తారన్నారు. ఎటిఎం వద్ద కార్డు ఇతరుల చేతికి ఇవ్వడం పిన్ నెంబర్ చెప్పకూడదన్నారు. దగ్గర బంధువులు అయితేనే ఎటిఎం కార్డు పిన్ నెంబర్ తెలిపి అప్పటికప్పుడే అక్కడ దాన్ని డిలీట్ చేయాలన్నారు.కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షులు రామలక్ష్మి, సంఘమిత్రలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన రామ్‌చరణ్‌నాయక్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : తంబళ్లపల్లి గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థి రామ్ చరణ్‌నాయక్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక అయ్యాడు. మదనపల్లిలో జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జిఎఫ్ అండర్-14 వాలీబాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పిఇటి దేశ్ ముఖ్ తెలిపారు. ఈనెల 8న విజయనగరంలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. రామచరణ్‌నాయక్‌ను ప్రిన్సిపల్ షబానా, పిఎటి దేశ్ ముఖ్, ఎంఇఒ త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు అభినం దించారు.

ఎగ్జిబిషన్‌లో చైతన్య సంస్థ చిన్నారుల సందడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని దేవతానగర్‌లో గల చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థలో ఆశ్రయం పొందుతున్న 95 మంది చిన్నారులు, సిబ్బంది బుధవారం లండన్ బ్రిడ్జ్ ఎగ్జిబిషన్‌ను వీక్షించారు. లండన్ బ్రిడ్జ్ యాజమాన్యం చైతన్య చిన్నా రులు, సిబ్బందికి ఉచిత ప్రవేశాన్ని కల్పించారు. ఎగ్జిబిషన్‌లోని కొలంబస్, బ్రేక్ డాన్స్, డ్రాగన్, త్రీడీ షో, ఏరోప్లేన్, బైక్, వాటర్ గేమ్స్, జాయింట్ వీల్ ఎక్కిన చిన్నారులు సందడి చేశారు. అనంతరం సంస్థ నిర్వాహకులు ఆనందన్ మాట్లాడుతూ సంస్థలోని నిరాధారణకు గురైన చిన్నారులకు ఉచిత ఎగ్జిబిషన్ ప్రవేశం కల్పించిన లండన్ బ్రిడ్జ్ ఎగ్జిబిషన్ యాజమాన్యం, కో-ఆర్డినేటర్ కలకడ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు.


ఎగ్జిబిషన్‌లో సందడి చేస్తున్న చిన్నారులు



బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించండి

ప్రజాశక్తి-కలికిరి

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనానికి ప్రజలందరూ సహకరించాలని జిల్లా కార్మిక శాఖ అధికారి మధుబాబు పిలుపునిచ్చారు. కలికిరిలో బుధవారం బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన గురించి అవగాహన కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వివిధ దుకాణాలు, హోటళ్లు, మెకానిక్ షాపులు, కార్ గ్యారేజీలు, తనిఖీ చేశారు. దుకాణ యజమానులకు వర్క్ షాప్, హోటల్ యజమానులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం ద్వారా కలిగే పరిణామాల గురించి అవగాహన కల్పించారు. చదువుకునే పిల్లలను 14 సంవత్సరాలు లోపల వయస్సు గల పిల్లలను పనిలో ఉంచుకోరాదని అందరికీ సూచనలు చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలని సంపాదన కోసం బడికి పంపకుండా పనిలో ఉంచితే చట్టరీత్యా శిక్షార్హులు అవుతారని ఆయన అన్నారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన గురించి ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ఐసిడిఎస్ అంగన్వాడీ టీచర్స్, వర్కర్లు డిసిపియు సోషల్ వర్కర్ డి.లావణ్య, మహిళా పోలీస్ వజ్రావతి , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాట ఆదాయం రూ.9.06 లక్షలు

ప్రజాశక్తి-గుర్రం కొండ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలోని రెడ్డెమ్మ దేవస్థానానికి సంబంధించి వేలంపాట ద్వారా రూ.9,06,800లు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఒ మంజుల తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూటోల్గేట్ రూ.4,23,000, కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకొనుటకు రూ.1,97000 లు, టీ, టిఫిన్ హోటల్స్ పెట్టుకొను రూ.52,600లు, శ్రీ అమ్మవా రికి భక్తులు సమర్పించిన వస్త్రాల సేకరించుకొనుట రూ.1,12,500లు, కూల్ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్ అమ్ముకోనుట రూ.40,700లు ల్యామి నేషన్, ఫొటోలు, బొమ్మలు అమ్ముకునే హక్కులకు రూ.81,000లు వేలం పాట దేవదాయశాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేలం పాటల వలన రూ 9,06,800లు ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని సప్తగిరి గ్రామీణ బ్యాంకు వాయల్పాడులో జమ చేయనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలోని రెడ్డివారిపల్లె చెరువుకట్ట సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు పితాని వెంకటనారాయణ (40)అనే యువకుడిని గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హత్యకు గురైన వెంకటనారాయణ ఉర్లగట్టుపోడులో నివాసం ఉంటూ కోడూరు,తిరుపతి తదితర ప్రాంతాలలో గృహ నిర్మాణాలలో టైల్స్ వేసే లేబరుగా పనిచేస్తున్నాడని, గుర్తించేందుకు జాగిలాలను కూడా తెప్పించామని,హత్యకు గల కారణాలను తెలుసుకునేందుకు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రకాశం జిల్లా వాసి మదనపల్లెలో మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రకాశం జిల్లా వాసి బుధవారం మదనపల్లెలో మృతి చెందాడు. టూటౌన్ పిఐ కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, సింగరాయ కొండలోని సెల్ టవర్‌వీధిలో నివాసముండే షేక్ నజీర్‌అహమ్మద్(66) మదనపల్లె ఆర్‌టిసి బస్టాండ్ అవణంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని జేబులోని ఆధార్ కార్డు ఆధారంగా మృతుడిది ప్రకాశం జిల్లా, సింగరాయకొండ సెల్ టవర్ వీధిలో కాపురం ఉంటున్న షేక్ నజీర్ అహ్మద్‌గా గుర్తించి అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని స్థానిక జిల్లా ఆస్పత్రికి మార్చురీకి తరలించారు. మృతుడి బంధువులు మదనపల్లె రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐని ఆశ్రయించి మృతదేహాన్ని తీసుకు వెళ్ళాలని తెలిపారు. ఇంకా ఏదైనా సమాచారం కావాలంటే 9440796741 నెంబర్ ను సంప్రదించాలని సిఐ తెలిపారు.

మద్యం మత్తులోయువకుడి ..

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మద్యం తాగి కోమాలోకి వెళ్లిన యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కురబలకోట మండలం, ఎరిమద్ది వారిపల్లెకు చెందిన ద్వారకనాథరెడ్డి(28) ఆటో నడుపుతూ జీవనం చేసేవాడని తెలిపారు. సోమవారం అతిగా మద్యం తాగి కొండ ప్రాంతంలో పడుకున్నాడని తెలిపారు. అక్కడ చీమలు శరీర భాగాలను బాగా గాయపరిచాయని తెలిపారు. అతను స్పృహ లేకుండా పడి పోయాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం పశువుల కాపర్లు గమనించి సమాచారం అందించారని తెలిపారు.మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి తరలించిన ట్లు తెలిపారు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లి: మండల కేంద్రం ములకలచెరువు వద్ద టెంపో ఢీకొనడంతో తంబళ్లపల్లె లైన్‌మెన్ తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రకమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. ములకలచెరువు మండలం వేపూరుకోట పంచాయితీ, రెడ్డివారిపల్లికి చెందిన బి.అప్పిరెడ్డి తంబళ్ల పల్లె ట్రాన్స్‌కో విభాగంలో లైన్‌మెన్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం 6.30 గంటల వరకు విధులు నిర్వరించాడని తెలిపారు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చేందుకు బైకుపై స్వగ్రామానికి బయలుదేరి వస్తుండగా, మార్గ మధ్యంలోని దేవలచెరువు వద్ద టెంపో బైక్‌ను ఢీకొనడంతో కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి క్షతగాత్రుడిని చికిత్సల కోసం హుటా హుటినా మదనపల్లెకి తరలించినట్లు తెలిపారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించి అక్కడి నుంచి తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో రైతుకూ..

మందనపల్లి: కురబలకోట మండలం, తెట్టు గ్రామం, పులుసు గుంతలకు చెందిన రైతు రాము ద్విచక్ర వాహనంలో బుధవారం అంగళ్లు కు బయల్దేరాడు. అదే పంచాయతీ తెట్టుకు చెందిన మరో రైతు అదేప్ప అంగళ్లు నుంచి స్వగ్రామానికి బైక్‌లో బయల్దేరాడు. మార్గమధ్యంలోని మండెంవారిపల్లె గంగమ్మ గుడి వద్ద రెండు వాహనాలు ఎదురెదురు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు రైతులు తీవ్రంగా గాయపడగా 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరి పరిస్థితి ఆందోళన కరంగా ఉండడంతో తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు.

ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ప్రేమించి పెళ్లి చేసుకోవాలనుకుంటున్న తమను పెద్దలు విడదీస్తు న్నారని ఓ యువతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఒకటవ పట్టణ పోలీసుల కథనం మేరకు..మదనపల్లె బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నెలో ఉండే నగీనా మదనపల్లె రీడింగ్ రూమ్ వీధిలో ఓ బట్టల షాపులో పనిచేస్తోందన్నారు. తనతో పాటు పనిచేసే అబ్దుల్ రజాక్ ప్రేమించు కుంటున్నారని తెలిపారు. వీరి పెళ్లికి రజాక్ మామ సయ్యద్ షావలి అడ్డుపడి మందిలో అసభ్యకరంగా మాట్లాడి పరువు తీశాని అన్నారు. తీవ్ర మనస్థాపానికి గురైన యువతి ఎలుకల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలిని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలిం చినట్లు తెలిపారు. పరీక్షించిన వైద్యులు యువతి పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రుయా కు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.